జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శుక్రవారం 13 నవంబర్ 2026 పేజీలు:07



గండిడ్ ఎస్సీ కాలనీలో లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

- ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి చొరవతో

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజా జ్యోతి -- గండిడ్:

గండిడ్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో చాలా కాలంగా నెలకొన్న లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న తక్కువ విద్యుత్ వోల్టేజ్ సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, మిగతా 2 లో

దేవరకద్ర అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి!

- డిగ్రీ కళాశాల, క్రీడా మైదానానికి భూమి కేటాయించాలి..
కలెక్టర్‌కు జీఎంఆర్ విజ్ఞప్తి



మహబూబ్‌నగర్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో):

దేవరకద్ర నియోజకవర్గంలోని విద్య, క్రీడలు, తాగునీరు తదితర సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కోరారు. ఈ సందర్భంగా దేవరకద్ర పట్టణంలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలని, క్రీడా మైదానం నిర్మాణానికి అదనంగా 3 ఎకరాల 30 గుంటల భూమి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మిగతా 2 లో

ఉచిత వైద్య సేవల్లో స్టార్ హెల్త్ సేవా కేంద్రం

- మహబూబ్‌నగర్‌లో 5,045 మందికి వైద్య సేవలు..
పరీక్షలు, మందులు ఉచితం - తొమ్మిది రాష్ట్రాల్లో 32 కేంద్రాల ద్వారా 1.83 లక్షల మందికి పైగా సేవలు




మహబూబ్‌నగర్ నవంబర్ 12

(ప్రజా జ్యోతి బ్యూరో):

పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత ప్రాథమిక వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ సంస్థ నిర్వహిస్తున్న ఆరోగ్య సేవా కేంద్రం మహబూబ్‌నగర్‌లో విశేష సేవలందిస్తోంది. 2026 సెప్టెంబర్ నాటికి ఈ కేంద్రం ద్వారా మొత్తం 5,045 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు సంస్థ వెల్లడించింది. రోజుకు సగటున 19 మంది చొప్పున వైద్య సేవలు పొందుతున్నారు. వెంకటేశ్వర కాలనీ, లక్ష్మీనగర్‌లోని ఈ కేంద్రంలో ఉచిత వైద్యుల సంప్రదింపులు, రక్త పరీక్షలు, మధుమేహం, రక్తపోటు పరీక్షలు, అవసరమైన మందులు, ఆరోగ్య సలహాలు, అర్హులకు టీకాలు అందిస్తున్నారు. మిగతా 2 లో

విద్యాశాఖ పనితీరులో జిల్లా టాప్--5లో నిలవాలి

- అధికారులకు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశం



- పాఠశాలల తనిఖీలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ, విద్యార్థుల గుర్తింపు నమోదు వేగవంతం చేయాలి

మహబూబ్‌నగర్, నవంబర్ 12

(ప్రజా జ్యోతి బ్యూరో):

విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిలో మహబూబ్‌నగర్ జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి ఐదు స్థానాల్లో నిలిపేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వెబెక్స్ ద్వారా మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పాఠశాలల తనిఖీలు, అభివృద్ధి పనుల పురోగతి, వాటి నాణ్యత, పర్యటనల చిత్రాల నమోదు, విద్యార్థుల ఆధార్ అనుసంధానం, అపార్ గుర్తింపు సంఖ్యల నమోదుపై సమీక్షించారు. మిగతా 2 లో

ఉచిత వైద్య సేవల్లో స్టార్ హెల్త్ సేవా కేంద్రం

మొదటిపేజీ తరువాయి



45 నుంచి 75 ఏళ్ల మధ్య వయస్కులు ఎక్కువగా ఈ కేంద్రాన్ని సందర్శిస్తుండగా, రక్తపోటు, జ్వరం, మధుమేహ సమస్యలతో వచ్చే వారు అధికంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఒక వైద్యుడు, నర్సు, సహాయక సిబ్బందితో నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో రక్తంలో చక్కెర, హిమోగ్లోబిన్, మలేరియా తదితర పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తున్నారు. సంస్థ వ్యాపార విభాగం అధిపతి శ్రీనివాస్ కేబీబీ మాట్లాడుతూ, సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా పది లక్షల మందికి ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు. తెలంగాణలో మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్‌లో కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టార్ హెల్త్ సంస్థ, పిరమల్ ఫౌండేషన్‌లో భాగమైన పిరమల్ స్వాస్థ్య సహకారంతో తొమ్మిది రాష్ట్రాల్లో 32 ఆరోగ్య సేవా కేంద్రాలను నిర్వహిస్తోంది. వీటి ద్వారా దేశవ్యాప్తంగా 1.83 లక్షల మందికి పైగా ప్రజలు ప్రయోజనం పొందినట్లు సంస్థ వెల్లడించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ అలీనా, క్రిస్టోఫర్, శ్రీనివాస్ కేబీబీ, మణికంఠ, సుబ్రహ్మణ్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.కేంద్రం చిరునామా: ఇంటి నంబర్ 7-5-114/6/ఖీ, వెంకటేశ్వర కాలనీ, లక్ష్మీనగర్, మహబూబ్‌నగర్--509001.

దేవరకద్ర అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి!

మొదటిపేజీ తరువాయి



చిన్నచింతకుంట జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ అంశాన్ని కూడా ప్రస్తావించారు. భూత్పూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించి తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా సానుకూలంగా స్పందించారు.

విద్యాశాఖ పనితీరులో జిల్లా టాప్--5లో నిలవాలి

మొదటిపేజీ తరువాయి



ప్రతి మండల విద్యాశాఖ అధికారి తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి అభివృద్ధి పనుల నాణ్యతను స్వయంగా పరిశీలించాలని సూచించారు. తనిఖీల చిత్రాలను సంబంధిత అంతర్జాల వేదికలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆధార్ అనుసంధానం, అర్హులైన విద్యార్థుల అపార్ గుర్తింపు సంఖ్యల నమోదును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి, లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

గండిడ్ ఎస్సీ కాలనీలో లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

ఆయన చొరవతో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను గండిడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆర్. భగవంతు రెడ్డి, ఉప సర్పంచ్ గుమ్మడాల చెన్నయ్య, సొసైటీ డైరెక్టర్ ఆర్. శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యుత్ శాఖ లైన్‌మెన్లు, మండల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఎస్సీ కాలనీలో లో వోల్టేజ్ సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



గగ్గలపల్లి పాఠశాలలో షెడ్ నిర్మాణానికి భూమి పూజ

- 1,60,000 వ్యయంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మాణం

నాగర్ కర్నూల్ : నవంబర్ 12 (ప్రజా జ్యోతి)



నాగర్ కర్నూల్ మండల గగ్గలపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మించబోయే షెడ్డు నిర్మాణానికి గురువారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు.సుమారు 1 లక్షా 60 వేల రూపాయల వ్యయంతో నిర్మించనున్న షెడ్డు నిర్మాణానికి ముఖ్య అతిథిగాలయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ,డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ దొడ్ల రాజవర్ధన్ రెడ్డి,నిర్మాణానికి ఆర్థికంగా సహకరిస్తున్న లయన్స్ సభ్యులు కలిసి పూజా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ,గతంలో దొడ్ల రాజవర్ధన్ రెడ్డి లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా పనిచేసిన సమయంలో పాఠశాలలో వేదికను నిర్మించడం జరిగిందని పాఠ శాల ఉపాధ్యాయుల కోరిక మేరకు ఇప్పుడు అదే వేదికపై షెడ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.లయన్స్ క్లబ్ఆధ్వర్యంలో ఇప్పటివరకు అనేకప్రాంతాల్లో బస్సు షెల్టర్లు,ప్రభుత్వ పాఠశాలలకు నీటి ట్యాంకులను అందిస్తున్నామని,ఇక ముందు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.పాఠశాలప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రావు మాట్లాడుతూ,పాఠశాలకు అవసరమైన షెడ్డు నిర్మాణానికిముందుకు వచ్చిన లయన్స్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని,విద్యార్థులకు ఎండ,వాన నుండి రక్షణ కల్పించడంతో పాటు,పాఠశాల కార్యక్రమాల నిర్వహణకు షెడ్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిలేందర్,డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ దొడ్ల రాజవర్ధన్ రెడ్డి,దొడ్ల ఈశ్వర్ రెడ్డి,క్లబ్అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి,కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి,కోశాధికారి ప్రేమ్ కుమార్ రెడ్డి,మాజీ అధ్యక్షులు తెప్ప శ్రీను, రామకృష్ణ రెడ్డి,సభ్యులు శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ ఉమర్,వార్డు సభ్యులు,పాఠశాల ఉపాధ్యాయులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుళాయి నీళ్ళు వృధా చేస్తే కుళాయి కలెక్షన్ కట్ అయిజ మున్సిపల్ కమిషర్

ఆలంపూర్ నవంబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తగ్గి, నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. అందువల్ల ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించి, క్రింది నిబంధనలు పాటించాలి: మున్సిపల్ అనుమతి లేకుండా కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయరాదు. మున్సిపల్ పైప్‌లైన్‌కు మోటార్లు బిగించి నీటిని తోడరాదు. ఉల్లంఘించిన వారికి రూ.5,000 జరిమానా విధించబడుతుంది. అదేవిధంగా కుళాయి నీటిని వృధా చేయరాదు. వినియోగం పూర్తయిన వెంటనే కుళాయిని బిగించాలి. మున్సిపల్ కుళాయి నీటితో కింది పనులు చేసినట్లయితే జరిమానా విధించబడుతుంది అలాగే కారు కడిగితే రూ.5,000 బైక్ కడిగితే --- రూ.2,000 ఇంటి ముందు నేలను కడిగితే --- రూ.2,000 ప్రతి కుళాయి కనెక్షన్‌కు బిట్ ట్యాప్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. నీటి వృధా లేదా అక్రమ వినియోగం గమనించినట్లయితే మున్సిపల్ నీటి సరఫరా లైన్ మెన్లు విభాగానికి తెలియజేయండి. నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరుతున్నాము.



కొల్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద బస్ షెల్టర్ నిర్మించాలి

- ప్రయాణికుల ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి- నాగర్ కర్నూల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి, అడాక్ కమిటీ సభ్యులు టైగర్ రమేష్ కొప్పుల

నాగర్ కర్నూల్ నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో)



కొల్లాపూర్ ఎక్సరోడ్ వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొప్పుల రమేష్ ఆరోపించారు. ఈ ప్రాంతం నుంచి నాగర్ కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట తదితర ప్రాంతాలకు నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులు, వివిధ పనుల నిమిత్తం ప్రయాణించే సామాన్య ప్రజలకు ఈ ప్రాంతం ఒక ముఖ్యమైన రవాణా కూడలిగా మారింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కొల్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ప్రయాణికులు నిలబడేందుకు కనీస సౌకర్యాలు లేకపోవడం విచారకరం. ముఖ్యంగా ఎండాకాలంలో ఎండ తీవ్రతను తట్టుకుంటూ, వర్షాకాలంలో వర్షంలో తడుస్తూ, చలికాలంలో చలికి ఇబ్బందులు పడుతూ బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చిన్నపిల్లలతో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.అదేవిధంగా కొల్లాపూర్ ఎక్స్ రోడ్ సమీపంలో కలెక్టర్ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయం, ఆసుపత్రులు, దేవాలయాలు వంటి అనేక ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలకు అవసరమైన ప్రదేశాలు ఉన్నాయి. ప్రతిరోజూ ఈ ప్రాంతానికి వివిధ పనుల నిమిత్తం ఎంతోమంది ప్రజలు వస్తుంటారు. ఇంతటి రద్దీ, ప్రాధాన్యత కలిగిన ప్రాంతంలో ప్రయాణికుల కోసం ఒక బస్ షెల్టర్ కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది.ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు బాధ్యత. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు నీడ కల్పించడం, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో వెలుతురు ఉండేలా లైటింగ్ సౌకర్యం కల్పించడం ఎంతో అవసరం. అలాగే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్సులు నిలిచేందుకు సరైన స్థలాన్ని గుర్తించి బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలి.ఇంతమంది ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ సమస్యపై ఇప్పటివరకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు . కాగా ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఇలాంటి ప్రాథమిక సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని ఆరోపించారు ఇప్పటికైనా సంబంధిత..ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కొల్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ప్రయాణికుల రద్దీని పరిశీలించి, వెంటనే అన్ని సౌకర్యాలతో కూడిన బస్ షెల్టర్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ తరపున సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బాలకృష్ణ సుబ్బారెడ్డి దివాకర్ నాయుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వ్యాపారవేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం!

- వ్యాపార అభివృద్ధిపై అవగాహన సదస్సు.. రుణాలు, మార్కెటింగ్‌పై మార్గదర్శనం

మహబూబ్‌నగర్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో):

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. బండమీదిపల్లిలోని జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా వ్యాపారవేత్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ర్యాంప్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీ-హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యాపార నైపుణ్యాల అభివృద్ధి, ఉత్పత్తుల తయారీ, బ్రాండింగ్, మార్కెటింగ్, రుణ సదుపాయాలు, నిపుణుల సలహాలపై వివరించారు. వస్త్ర పరిశ్రమ, ఆహార శుద్ధి, తయారీ, హస్తకళలు తదితర రంగాల్లో మహిళలు వ్యాపారాలను విస్తరించుకునేందుకు ఈ పథకం ద్వారా సహకారం అందుతుందని తెలిపారు. ఆసక్తి గల మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ రేణుక, డీపీఎం ఎన్ఎఫ్ రామమూర్తి, వీ-హబ్ ప్రాజెక్టు సమన్వయకర్తలు అబిద్, మునీష్, శ్రీకర్, ఏపీఎం ఎన్ఎఫ్ రమేష్, గురు, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.



భారత్‌మాల జాతీయ రహదారిపై ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఏర్పాటు చేయాలని మాజీ జెడ్పిటిసివడ్డేపల్లి శ్రీనివాసులు కి వినతి..



ఆలంపూర్ నవంబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

రాజోలి--వడ్డేపల్లి మండలాల సమగ్ర అభివృద్ధికి ఎంతో కీలకమైన భారత్‌మాల జాతీయ రహదారిపై ప్రజలకు అవసరమైన సర్వీస్ రోడ్డు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల సౌకర్యాలు కల్పించాలని కోరుతూ లిరాజోలి గ్రామస్తుల తరఫున అర్చకులు అడివిస్వామి అలంపూర్ నియోజకవర్గ,మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులుని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా భారత్‌మాల రహదారిపై తగిన ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు లేకపోవడం వల్ల రాజోలి, వడ్డేపల్లి మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర వైద్య సేవల కోసం ప్రయాణించే ప్రజలకు ఈ సౌకర్యాలు ఎంతో అవసరమని వివరించారు. అలాగే భారత్‌మాల రహదారికి అనుసంధానంగా సర్వీస్ రోడ్డు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఏర్పాటు చేస్తే రాజోలి--వడ్డేపల్లి మండలాల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. వారు అన్నారు అదేవిధంగా వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడం సులభతరమవుతుంది. అన్నారు అదేవిధంగాస్థానిక వ్యాపార, వాణిజ్య రంగాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. అదేవిధంగాపరిశ్రమలు, గోదాములు, ఇతర వ్యాపార సంస్థల ఏర్పాటుకు అవకాశాలు పెరుగుతాయి. స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. అదేవిధంగా అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలకు సౌలభ్యం కలుగుతుంది. అలాగే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రయాణ దూరం, సమయం మరియు ఇంధన ఖర్చులు తగ్గుతాయి. వారు అన్నారుఈ సమస్యపై వడ్డేపల్లి శ్రీనివాసులు సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, భారత్‌మాల రహదారిపై సర్వీస్ రోడ్డు, ఎంట్రీ, ఎగ్జిట్ సౌకర్యాల ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట..వడ్డేపల్లి పీఏసీఎస్ పగ్గాలు కొత్త పాలకవర్గం చేతికి!

- రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పీఏసీఎస్ నూతన పాలకవర్గం!

- వడ్డేపల్లి సింగిల్ విండో చైర్మన్‌గా ఎనుముల నాగరాజు,వైస్ చైర్మన్‌గా బి.రామకృష్ణారెడ్డి ప్రమాణ స్వీకారం

- నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు అలంపూర్ ప్రజల అభివృద్ధి కోసమే కృషి చేస్తా"

- డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్









అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) నవంబర్ 12:

రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ అన్నారు.వడ్డేపల్లి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా ఎనుముల నాగరాజు,వైస్ చైర్మన్‌గా బి.రామకృష్ణారెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ, అలంపూర్ నియోజకవర్గ ప్రజలు తన పేరు పక్కన అలంపూర్ మాజీ శాసనసభ్యుడు'అనే గుర్తింపును శాశ్వతంగా నిలిపినందుకు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు.తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు అలంపూర్ ప్రజల బాగోగులు, నియోజకవర్గ అభివృద్ధి కోసమే నిరంతరం తపిస్తానని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ సహకారంతో అలంపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.సహకార సంఘాలు రైతులకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు, సహకారంతో వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలని నూతన చైర్మన్,వైస్ చైర్మన్‌కు సూచించారు.అనంతరం నూతన చైర్మన్ ఎనుముల నాగరాజు,వైస్ చైర్మన్ బి.రామకృష్ణారెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అణివేశ్వర్ రెడ్డి, జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీను, ఆర్డీఎస్ మాజీ చైర్మన్ తనగల సీతారామ రెడ్డి,వడ్డేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, వాల్మీకి కమిటీ చైర్మన్ గట్టు తిమ్మప్ప,మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంకపురం రాముడు,వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు,జిల్లా కాంగ్రెస్ నాయకులు,పార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన ఉండాలి

- డిస్టిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ నిహారిక

నాగర్ కర్నూల్ : నవంబర్ 12 (ప్రజా జ్యోతి)

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో జాతీయ న్యాయసేవ దినోత్సవం (నవంబర్ 9) ని పురస్కరించుకుని నిర్వహించే వారోత్సవాలలో బాగం గా గురువారం బిజినపల్లి మండలం వడ్డెమాన్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిహారిక హజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాలపట్ల కనీస అవగాహన కలిగి ఉండాలి అన్నారు.ఈ విధంగా అవగాహన కలిగి ఉండడం వల్ల సమాజంలో నేరాలు జరగకుండా అరికట్టవచ్చని,తద్వారా నేరరహిత సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు.అదేవిధంగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసె స్ అథారిటీ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను వివరించారు.సైబర్ క్రైమ్,మోటార్ వెహికల్ ఆక్ట్, పోక్సో చట్టంగురించి వివరింస్తూ ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్తోమతలేని వారుంటే మా సంస్థ తరుపున ఉచితంగా న్యాయవాదిని





నియమిస్తామని,ఉచిత న్యాయ సలహాలకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో శ్రీరామ్ ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, పంచాయతీ కార్యదర్శి,పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భవిష్యత్తు నిర్ణయాల్లో తాత్సారం వద్దు.!

- యువతకు వచ్చే పదేళ్లు ఎంతో కీలకం.. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాల 25వ పట్టాల ప్రదానోత్సవం..

- 90 మందికి పట్టాలు



మహబూబ్‌నగర్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో):

విద్యాభ్యాసం పూర్తిచేసుకుని వృత్తి జీవితంలోకి అడుగుపెడుతున్న యువత భవిష్యత్తుకు సంబంధించిన ప్రతి నిర్ణయాన్ని ఆచితూచి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. యువత జీవితంలో వచ్చే పదేళ్లు అత్యంత కీలకమని, ఈ సమయంలో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు.మహబూబ్‌నగర్‌లోని సరోజినీ రాములమ్మ ఫార్మసీ



కళాశాలలో నిర్వహించిన 25వ పట్టాల ప్రదానోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళాశాలలో నేర్చుకున్న క్రమశిక్షణ, విజ్ఞానం, నైపుణ్యాలను వృత్తి జీవితంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. ఇతరుల ఒత్తిడికి, తాత్కాలిక భావోద్వేగాలకు లోనుకాకుండా తల్లిదండ్రులు, గురువుల సలహాలు తీసుకుని సరైన నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. కళాశాల పూర్వ విద్యార్థులు దేశవిదేశాల్లోని ప్రముఖ ఔషధ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగడం గర్వకారణమని



అభినందించారు. ప్రస్తుత విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించి తాము చదువుకున్న కళాశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మ్-డి కోర్సులు పూర్తిచేసిన 90 మంది విద్యార్థులకు కలెక్టర్ పట్టాలు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. మంగీలాల్, కార్యదర్శి పద్మలత, చైర్మన్ డాక్టర్ పి. బాలరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
శుక్రవారం 13 నవంబర్ 2026

ఓట్ల వేళ మైనార్టీల సంక్షేమం.. పనుల వేళ వారి ఆరోగ్యం పట్టదా..?

- బీ.కే.రెడ్డి కాలనీలో భారీ కాలువ నిర్మాణంపై స్థానికుల ఆగ్రహం - అవసరానికి మించి కాలువ నిర్మాణం ఎందుకు..?


ముస్లిం మైనార్టీల పట్ల చిన్నచూపు చూస్తున్నారంటూ ఆరోపణలు.. పనులు నిలిపివేసి విచారణ చేపట్టాలని డిమాండ్

మహబూబ్‌నగర్ నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల లక్ష్యమని, మైనార్టీల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పాలకులు తరచూ చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదని బీ.కే. రెడ్డి కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ నంబర్ 49 పరిధిలోని బీఎన్ రెడ్డి కాలనీలో చెరువు కట్ట తూము నీటి ప్రవాహం కోసం నిర్మిస్తున్న భారీ కాలువ స్థానిక ప్రజలకు ఆందోళనగా మారింది. నీటి ప్రవాహానికి అవసరమైన మేరకు మాత్రమే కాలువ నిర్మించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా అవసరానికి మించి భారీ కాలువ నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఆరోగ్యపరమైన, భద్రతాపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కాలువ పనుల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు.

మైనార్టీల సంక్షేమం మాటలకే పరిమితమా.?

ఈ వ్యవహారంలో మరో కీలకమైన అంశాన్ని స్థానికులు లేవనెత్తుతున్నారు. కాలువ నిర్మాణం చేపడుతున్న ప్రాంతంలో ముస్లిం మైనార్టీ కుటుంబాలు నివసిస్తున్న నేపథ్యంలో, వారి అభిప్రాయాలను, ఆరోగ్య భద్రతను పరిగణనలోకి తీసుకోకుండా పనులు చేపట్టడం వెనుక వివక్ష ఉందా.? అన్న అనుమానాలను కొందరు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీల ఓట్ల కోసం సంక్షేమం, అభివృద్ధి అంటూ హామీలు ఇచ్చే నాయకులు, వారి నివాస ప్రాంతాల్లో మౌలిక వసతుల



పనులు చేపట్టేటప్పుడు మాత్రం వారి సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.అయితే ఈ నిర్మాణం వెనుక ఉద్దేశపూర్వక వివక్ష ఉందా.? లేక సాంకేతిక ప్రణాళికలో లోపాలున్నాయా.? అన్నది సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపితేనే స్పష్టమవుతుంది.

అధికారులకు కనిపించని ప్రజల ఆవేదన.?

ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు ఉపశమనం కలిగించాలి కానీ, వారి ఆరోగ్యానికి, ప్రశాంత జీవనానికి ముప్పుగా మారకూడదు. కాలువ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అనుమతులు, అంచనాలు, డిజైన్, నీటి ప్రవాహ సామర్థ్యం వంటి అంశాలను అధికారులు బహిరంగంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.కాబట్టి సంబంధిత అధికారులు తక్షణమే కాలువ పనులను తాత్కాలికంగా నిలిపివేసి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను





సేకరించి, ఆరోగ్య భద్రతకు భంగం కలగని ప్రత్యామ్నాయ మార్గాన్ని రూపొందించిన తర్వాతే నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. అభివృద్ధి అంటే కేవలం నిర్మాణాలు చేపట్టడం కాదు.. ప్రజల ఆరోగ్యం, భద్రత, ఆత్మగౌరవాన్ని కాపాడటమే నిజమైన సంక్షేమం. బీకే రెడ్డి కాలనీ ప్రజల ఆవేదనకు పాలకులు, అధికారులు ఎప్పుడు స్పందిస్తారో వేచి చూడాలి.!

ఈ నెల 14న లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ అందజేయనున్న

ఆలంపూర్ నియోజకవర్గ

శాసనసభ్యుడు విజయుడు

ఆలంపూర్ నవంబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లో ఈ నెల 14-11-2026 (శనివారం) ఉదయం 10:00 గంటలకు అలంపూర్ ఎక్స్ రోడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అయిజ మండలానికి సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి అయిజ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత లబ్ధిదారులు హాజరుకావాలని కోరడమైనది.కావున ప్రతి ఒక్కరూ సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని విజ్ఞప్తి. చేశారు.

భూ రీసర్వేలో తప్పులకు తావుండకూడదు.!

- పారదర్శకతతో సర్వే పూర్తి చేయాలి..

అధికారులకు అదనపు కలెక్టర్ హరిప్రియ ఆదేశం

మహబూబ్‌నగర్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో):

భూ రీసర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో సర్వే పనులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. నవాబుపేట మండలం దేపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనుల పురోగతిని సమీక్షించారు. పట్టా వ్యవసాయ భూములు, ప్రభుత్వ భూములు, ఇతర భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల్లో నమోదైన వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి భూముల విస్తీర్ణాలు, సరిహద్దులను తనిఖీ చేశారు. సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణాలు, వర్గీకరణ వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు.

రైతుల సమక్షంలోనే సర్వేకు ప్రాధాన్యం

అనంతరం రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ రీసర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సర్వే నిర్వహించే తేదీ, సమయాన్ని ముందుగానే పట్టాదారులకు తెలియజేయాలని, సర్వే సమయంలో వారు తమ తాజా భూ



రికార్డులతో అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. సర్వే పూర్తయిన తర్వాత సంబంధిత పట్టాదారులకు వారి భూముల తుది విస్తీర్ణాలను తెలియజేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలు తలెత్తకుండా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, రైతులతో సమన్వయం చేసుకుంటూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు అశోక్, నవాబుపేట తహసీల్దార్ సురేష్, డిప్యూటీ తహసీల్దార్ సువర్ణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే మూసా, మండల సర్వేయర్ అహ్మద్, సంబంధిత సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో జాప్యం సహించేది లేదు.!

- సకాలంలో జీతాలు చెల్లించాలి..
పెండింగ్ బకాయిల వివరాలు సమర్పించాలి
- ఏజెన్సీలకు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశం

మహబూబ్‌నగర్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో):



ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలను సకాలంలో చెల్లించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులను ఆదేశించారు. వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఉపాధి అధికారితో కలిసి వివిధ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల వేతన చెల్లింపులు, జాప్యానికి గల కారణాలు, ఏజెన్సీల వారీగా పెండింగ్‌లో ఉన్న బకాయిలపై చర్చించారు. ప్రతి ఏజెన్సీ తమ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు, చెల్లించిన వేతనాలు, పెండింగ్ బకాయిల పూర్తి సమాచారాన్ని సమర్పించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా వేతనాలు చెల్లించాలని, ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉపాధి అధికారి మైత్రీ ప్రియ, వివిధ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు ముల్లా షాబుద్దీన్ మృతి తీరని లోటు

- కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించిన
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి

మహబూబ్‌నగర్ నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో):



సీనియర్ జర్నలిస్టు, మహబూబ్ నగర్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు, ఎత్తేమాద్ ఉర్దూ దినపత్రిక జిల్లా ప్రతినిధి ముల్లా షాబుద్దీన్ అకాల మరణం జర్నలిజం రంగానికి తీరని లోటని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటీవల గుండెపోటుకు గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న మిథున్ రెడ్డి, ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను తన కలం ద్వారా నిరంతరం వెలుగులోకి తీసుకువచ్చిన ముల్లా షాబుద్దీన్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మృతి జర్నలిజం రంగానికి తీరని లోటని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అజ్మత్ అలీ, రాములు యాదవ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేందర్ చారి, నరేందర్ గౌడ్, పల్లెమోని యాదయ్య, మోహన్ దాస్, అబ్దుల్ హాహీద్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఇవ్వాలి.!

- నవంబర్ 28న ఢిల్లీలో 'చలో రామ్‌లీలా మైదాన్' దేశవ్యాప్త ఉద్యమం
- జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి.. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

మహబూబ్ నగర్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో):

2027లో నిర్వహించనున్న కులగణనను సమగ్రంగా, శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపట్టాలని, ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, జనరల్ కేటగిరీల్లోని ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు కోడ్, డ్రాప్‌డౌన్ ఆప్షన్ కల్పించాలని మాజీ మంత్రి, అఖిల భారత ఓబీసీ ప్రజాప్రతినిధుల ఫోరం జాతీయ కన్వీనర్ విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం నవంబర్ 28న న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో దేశవ్యాప్త నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రకటించారు.న్యూఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఆల్ ఇండియా ఓబీసీ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని కులాల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై కచ్చితమైన గణాంకాలు సేకరించేందుకు 2027 కులగణన ఒక చారిత్రాత్మక అవకాశమని పేర్కొన్నారు. జనాభాకు అనుగుణంగా విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలంటే కచ్చితమైన కులగణన అవసరమని స్పష్టం చేశారు.

కులాల నమోదులో గందరగోళానికి తావుండకూడదు

రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది పి. విల్సన్ మాట్లాడుతూ.. ఒకే కులం వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లు, స్పెల్లింగులు, ఉపకులాల పేర్లతో నమోదయ్యే అవకాశముందని, దీనివల్ల గణాంకాల్లో తప్పులు తలెత్తవచ్చని అన్నారు. అందుకే ముందుగానే రాష్ట్రాలవారీగా ప్రామాణిక కులాల జాబితా రూపొందించి, ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించాలని కోరారు.రాజకీయ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ.. కులగణన కేవలం జనాభా లెక్కల సేకరణకే పరిమితం కాకుండా సామాజిక న్యాయానికి సాధనంగా మారాలని అభిప్రాయపడ్డారు. కచ్చితమైన గణాంకాల ఆధారంగానే అసమానతలను గుర్తించి తగిన విధానాలు రూపొందించడం సాధ్యమన్నారు. పార్టీ ఫర్ ది రైట్స్ ఆఫ్ ఓబీసీస్, ఎస్ఎఫ్ఆర్‌బీసీ అధ్యక్షుడు వి. రత్నసబాపతి మాట్లాడుతూ ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు, కోడ్ కల్పించడం ద్వారానే సమానత్వం, ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం సాధ్యమవుతాయని పేర్కొన్నారు.అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. కులగణనలో అన్ని కులాలకు ప్రత్యేక గుర్తింపు కోడ్లు కల్పించడంతో పాటు రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించి జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నవంబర్ 28న జరిగే ఉద్యమంలో విద్యార్థులు, యువత, సామాజిక సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



కమిటీ ప్రధాన డిమాండ్లు ఇవే..

- 2027 కులగణనను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలి.
- అన్ని కులాలకు ప్రత్యేక డ్రాప్‌డౌన్ ఆప్షన్లు కల్పించాలి.
- ప్రతి కులానికి ప్రత్యేకమైన గుర్తింపు కోడ్ కేటాయించాలి.
- రాష్ట్రాలవారీగా ప్రామాణిక కులాల జాబితా రూపొందించాలి.
- కులాల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర గణాంకాలు సేకరించాలి.
- రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించి జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలి.ఈ డిమాండ్ల సాధన కోసం నవంబర్ 28న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించనున్న 'చలో రామ్‌లీలా మైదాన్' నిరసన ప్రదర్శనలో దేశవ్యాప్తంగా ఓబీసీ, బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు, సామాజిక న్యాయ ఉద్యమకారులు పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.